ఊరూరా చెరువుల పండుగ


బోనం ఎత్తుకుని చెరువు వద్దకు చేరుకుంటున్న ఎంపీపీ మార్నేని మధుమతి తదితరులు


నడికూడ మండల కేంద్రంలో బతుకమ్మ, బోనాలతో వస్తున్న మహిళలు


కమలాపూర్‌లో బతుకమ్మలతో చెరువు వద్దకు వెళ్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


ఆత్మకూరులో చెరువు వద్ద పూజలు చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


దామెరలో పూజలు చేస్తున్న జెడ్పీటీసీ కల్పన

ఐనవోలు: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని 17 గ్రామాల్లో గ్రామ పంచాయతీలు, నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా చెరువుల పండుగ నిర్వహించారు. అందులో భాగంగా సాయంత్రం గ్రామస్తులు డప్పులు బోనాలు, బతుకమ్మలతో చెరువు గట్లకు ఊరేగింపుగా బయలు దేరారు. చెరువు గట్లను అందంగా అలంకరించగా కట్టమైసమ్మ, చెరువు నీటికి ప్రత్యేక పూజలు చేశారు. బతుకమ్మ కోలాటాలు ఆడి, చెరువుకు సంబంధించిన పాటలు పాడి మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో పెరిగిన పంట ఉత్పత్తి వివరాలు, మత్స్య సంపద, భూగర్భ జలాల పెరుగుదల తదితర ప్రగతి నివేదికకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేసి గ్రామస్తులకు చదివి వినిపించారు. అనంతరం నాయకులు ప్రజలు చెరువు కట్టపై సహపంక్తి భోజనాలు చేశారు. ఎంపీడీఓ వెంకటరమణ మాట్లాడుతూ కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వం మేజర్ గ్రామ పంచాయతీలకు రూ.60 వేలు, మీడియం గ్రామ పంచాయతీలకు రూ.45 వేలు, చిన్న గ్రామ పంచాయతీలకు రూ.35 వేలు అందించినట్లు తెలియజేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మార్నేని మధుమతి, జెడ్పీవైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, వైస్ ఎంపీపీ తంపుల మోహన్, సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపెల్లి చందర్‌రావు, డైరెక్టర్లు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సెక్రటరీలు, మహిళ సంఘాల ప్రతినిధులు, ఆశాలు, అంగన్‌వాడీలు, ఆయా శాఖల అధికారులు, రైతులు, మహిళలు, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

నడికూడలో..

నడికూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఊరురా చెరువుల పండుగను గురువారం మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మహిళలు, బతుకమ్మ, బోనాలతో చెరువుల వద్దకు చేరుకొని పూజలు నిర్వహించారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల వ్యాప్తంగా చెరువుల పండుగ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించగా మహిళలు బోనాలు, కోలాటాలతో పాటలు పాడుతూ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామస్తులకు సాగు నీటి చెరువుల విశిష్టతను, మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువుల పూడిక తీత, చెరువుల అభివృద్ధితో కలిగిన లాభాలను వివరించారు. గ్రామస్తులతో కలిసి చెరువుల వద్ద సంపక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పల్లవి, తహసీల్దార్ రాణి, ఏపీఓ రమేష్, ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చెరువుల వద్ద దశాబ్ది సంబరాలు

ఆత్మకూరు: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఎంపిక చేసిన చెరువుల వద్ద గురువారం చెరువుల పండుగ ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, అధికారులు చెరువుల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, కట్ట మైసమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు బోనాలు, బతుకమ్మలతో చెరువుల వద్దకు చేరుకొని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సహపంక్తి భోజ నాలు చేశారు. ఎంపీపీ సుమలత, జెడ్పీటీసీ రాధిక, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, మత్స్య సంఘం చైర్మన్ తిరుపతి, బీఆర్‌ఎస్ నాయకులు భగవాన్‌రెడ్డి, రవీందర్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు జలకళ

దామెర: మిషన్ కాకతీయ పథకంతో చెరువులకు జలకళ సంతరించుకుందని ఎంపీపీ కాగితాల శంకర్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం ఊరూరా చెవుల పండుగను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో మహిళలు బోనాలు, బతుకమ్మలతో పోచమ్మ గుడికి చేరుకొని బోనం సమర్పించి బతుకమ్మలు ఆడారు. చెరువులకు పూజలు నిర్వహించిన అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ స్వరాష్ట్రంలో చెరువులకు పూర్వవైభవం వచ్చిందని అన్నారు. దామెరలో జెడ్పీటీసీ గరిగె కల్పన, ల్యాదెళ్లలో ఎంపీపీ కాగితాల శంకర్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ నాగరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లోనే మెరుగైన విద్య


దండెపల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించిన ఎంఈఓ రవీందర్

ఎల్కతుర్తి: సర్కారు బడుల్లోనే మెరుగైన విద్య లభిస్తుందని ఎంఈఓ రవీందర్ అన్నారు. మండలంలోని దండెపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు చేపట్టిన బడిబాట అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలల్లో కంటే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య బోధన లభిస్తుందని, ప్రవేటు పాఠశాలకు దీటుగా ఆగ్ల బోధన ప్రారంభించడం జరిగిందన్నారు. విద్యార్థులకు ఆగ్ల బోధనతో పాటు పౌష్టికారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు రెండు జతల యూనిఫాం, పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందిస్తున్నామని వెల్లడించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారులు రాధ, ఐఈ కోఆర్డినేటర్ సునీత, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు సత్యపతి, కుమారస్వామి, సీఆర్పీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


సమావేశంలో పాల్గొన్న సంఘాల నాయకులు

ఖిలా వరంగల్: ఆజంజాహి మిల్లు భూముల్లోనే కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కార్మిక, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వరంగల్‌లోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి మిల్లు భూముల్లోనే కార్మికులకు ఇళ్ల పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ, కార్మిక నాయకులు నాగపురి వెంకటేశ్వర్లు, కత్తెరసాల జగన్, ఆకుల మురళి, బైరబోయిన ఐలయ్య, మచ్చ రాజు, రైతు సంఘం నాయకులు వీరగోని శంకరయ్య, రాచర్ల బాలరాజు, కొండన్న, తెలంగాణ కొమురయ్య, కేడల ప్రసాద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మా భూమి మాకు ఇప్పించండి



చీఫ్‌విప్, ఎంపీ దయాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కడిపికొండ దళితులు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని సర్వేనంబర్ 366లోని 32ఎకరాల పంచరాయి భూమి 64 మంది దళితులకు చెందినదని దళిత కుటుంబాలు తెలిపాయి. 'మా భూమిని మాకే ఇప్పించాలని' ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్‌కు వేర్వేరుగా వినతి పత్రాలను బాధితులు గురువారం అందజేశారు. హనుమకొండ బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో చీఫ్‌విప్‌కు, హంటర్‌రోడ్డు న్యూశాయంపేటలోని ఎంపీని అతని నివాసంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బాధిత దళిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ 1974లో కడిపికొండకు చెందిన 64మంది దళితులకు ప్రభుత్వం కేటాయించిన 32ఎకరాల పంచరాయి భూమిని టీఎన్జీవోస్ నాయకులు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని వాపోయారు. సదరు భూమి విషయం కోర్టులో ఉన్నా కూడా సర్వే చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బస్కె రాజేందర్, లక్ష్మి, అనిత, విజయ, కోమల, సౌందర్య, రాధ, రాజయ్య పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

వరంగల్: జీఓ నంబర్ 21 ప్రకారం వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేసి, ఏజెన్సీలను రద్దు చేసి కమిటీ ద్వారానే వేతనాలు అందించాలని అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు మాసాని భాస్కర్ కోరారు. కనీస వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈమేరకు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దిడ్డి భాగ్యలక్ష్మి, మార్కెట్ ఎస్‌జీఎస్ బీవీ.రాహుల్‌కు గురువారం వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. వినతి పత్రాలు సమర్పించిన వారిలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సబ్బు రాజేందర్, కోశాధికారి చందనాల రాము, సింగారపు యాకయ్య, పార్సి సందీప్‌కుమార్, చిర్ర యాకోబు, నమిండ్ల నరసయ్య, బొమ్మగాని రవీందర్, ఈసంపల్లి యాదగిరి, యాకూబ్‌పాషా, పి.శ్రీనివాస్, ఎండీ.నజీరుద్దీన్, మెరుగు యాకయ్య, కే.శ్రావణ్‌కుమార్, ఎస్.నాగార్జున, ఎండీ.వాజిద్‌పాషా, ఎస్.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు పడితేనే విత్తనాలు విత్తుకోవాలి

కమలాపూర్: నైరుతి రుతు పవనాలు తెలంగాణకు చేరుకునేందుకు ఇంకా పది రోజుల సమయం ఉన్నందున రెండుసార్లు భారీ వర్షాలు పడితేనే ఆరుతడి పంటలు సాగు చేసే రైతులు విత్తనాలు విత్తుకోవాలని ఏఓ లక్ష్మారెడ్డి గురువారం ప్రకటనలో సూచించారు. ఆరుతడి పంటలైన పత్తి, మొక్కజొన్న, కంది పంటలు సాగు చేసే రైతులు మెలుకువలు పాటించాలని కోరారు. దీర్ఘకాల వరి నారు పోసుకునేందుకు ఇదే మంచి సమయమని, లైసెన్స్ ఉన్న కగిలి ఉన్న డీలర్ల వద్ద విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు అనంతరం బిల్లును తప్పకుండా తీసుకోవాలని తెలిపారు. భూసారం పెరిగేందుకు జీలుగ విత్తనాలను 65 శాతం సబ్సిడీపై కమలాపూర్ పీఏసీఎస్‌లో, అంబాలలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే చల్లా

దామెర/ఆత్మకురు / పరకాల: ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కుమార్తె జాహ్నవిరెడ్డి-అంకిత్ రెడ్డి వివాహం బుధవారం మండలంలోని దుర్గంపేట్ సమీపంలో గల ఎస్ఎస్ఆర్ నక్వెన్షన్ హాల్‌లో జరిగిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి మంత్రులు కేటీఆర్, మహమూద్ అలీ, దయాకర్ రావు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా అధికారులు, నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పెద్దెత్తున హాజరయ్యారై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా తన కూతరు వివాహానికి హాజరైన ప్రతీ ఒక్కరికి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి-జ్యోతి దంపతులు కృతజ్ఞతలు, తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆత్మకూరు: పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన తోట నారాయణస్వామి (36) తనకున్న ఎకరం భూమితో పాటు మరో 4 ఎకరాలు కౌలు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. అలాగే ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ప్రతిఏటా సాగుచేసే పంటలో నష్టం రావడంతోపాటు ఆటో సరిగా నడవకపోడం నారాయణస్వామి ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటీన వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు సీఐ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిజాం పాలనపై ఉద్యమ బావుటా


నివాళి అర్పిస్తున్న కాలనీ కమిటీ సభ్యులు

హన్మకొండ: నిజాం నిరంకుశ పాలకులపై అక్షర తుపాకీ ఎక్కుపెట్టి ఉద్యమ బావుట ఎగురవేసి ప్రజల్లో చైతన్య జ్వాలలు రగిలించిన సాయుధ పోరాట యోధుడు, గొప్ప సాహితీవేత్త దాశరథి రంగాచార్యులు అని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, హనుమాన్‌నగల్-1 అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చల్లా వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. రంగాచార్యుల 8వ వర్ధంతిని పురస్కరించుకుని దాశరథి చిత్రపటానికి గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు కుమార్‌రెడ్డి, సిరిమల్లె రాజయ్య, చిర్ర శ్రవణ్, రాజ్‌కుమార్, వెంకటేష్, రవికిరణ్, చిరంజీవి, సురేష్, గణేష్ పాల్గొన్నారు.

నీటితో కళకళలాడుతున్న చెరువులు


శాయంపేటలో మహిళలతో కలిసి బతుకమ్మ ఎత్తుకున్న గండ్ర జ్యోతి

శాయంపేట: గ్రామాల్లోని చెరువులన్నీ నీటితో కళకళలాడుతున్నాయని వరంగల్ జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఊరురా చెరువుల పండగా ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రగతి సింగారం, కాట్రపల్లి, వసంతాపూర్, శాయంపేట గ్రామాల్లో నిర్వహించిన చెరువుల పండుగలో పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.ఈ సందర్భంగా గండ్ర జ్యోతి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయ కార్యక్రమంతో ప్రతీ గ్రామంలోని చెరువులన్నీ నీటితో కళకళలాడుతున్నాయని అన్నారు. రాష్ట్రం ఏర్పాటు అనంతరం చెరువుల పునరుద్ధరణ, ఆయకట్టు స్థిరీకరణ, చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో పాటు చెరువులు నిండు కుండలా మారాయని అన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం పూర్తిచేస్తా


పూజలు చేస్తున్న విజయచందర్‌రెడ్డి

దామెర: మండలంలోని ల్యాదెళ్ల గ్రామంలో గల వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తానని రెడ్‌క్రాస్ చైర్మన్, బీజేపీ పరకాల నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ విజయచందర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరస్వామి ఆలయ పునఃప్రతిష్టాపన ప్రారంభ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్వామివారి కళ్యాణ మహోత్సవం, హోమం అంగరంగా వైభవంగా జరిగింది. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ స్వామివారి గరుడ విగ్రహం, ఉత్సవ విగ్రహాలను ఆయన ప్రతిష్టాపన చేశారు. అలాగే విజయచందర్ రెడ్డి-సుధేష్ణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పునఃనిర్మాణ దాతగా స్వామివారికి సేవచేసే అవకాశం వచ్చిందని, స్వగ్రామమైన ల్యాదెళ్లలో ఆలయ నిర్మాణం చేయడం పట్ల ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రావణ్య, గ్రామ పెద్దలు మహిపాల్ రెడ్డి, నర్సింహారెడ్డి, ప్రదీప్ రెడ్డి, దిలీప్ రెడ్డి, రమేష్ రెడ్డి, సుభాష్ రెడ్డి, నాయకులు హింగె శ్రీనివాస్, మాందాటి శ్రీకాంత్, పిట్టల రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెరువుల పండుగ హాస్యాస్పదం


ధ్వంసమైన చలివాగు ప్రాజెక్టు తూమును పరిశీలిస్తున్న నాయకులు

శాయంపేట: చెరువుల మరమ్మతులు చేపట్టకుండా చెరువుల పండగా చేయడం హాస్యాస్పందంగా ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి విమర్శించారు. మండలంలోని జోగంపల్లి శివారులో గల చలివాగు ప్రాజెక్టు తూమును, పలు గ్రామాలలోని చెరువులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మూడు మండలాలకు త్రాగునీరు, సాగునీరు అందించే చలివాగు ప్రాజెక్టుకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం చెరువుల పండుగ దినోత్సవం జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి కాళేశ్వరం ప్రాజెక్టు గురించి గొప్పలు చెబుతూ చలివాగు ప్రాజెక్టు పనులను గాలికొదిలేశారని విమర్శించారు. మండలంలోని చెరువులకు, చలివాగు ప్రాజెక్టుకు నిధులు కేటాయించి మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు వలీ హైదర్, నాయకులు పాల్గొన్నారు.

తాగునీరు తెచ్చిన గొప్పవ్యక్తి భగవాన్‌దాస్


నినాదాలు చేస్తున్న వినయ్‌భాస్కర్, తదితరులు

హన్మకొండ చౌరస్తా: వరంగల్ నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎస్ఆర్ఎస్పీ కెనాల్ ద్వారా నగరానికి నీరు తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి, పేదల నాయకుడు బీఆర్ భగవాన్‌దాస్ అని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కమ్యూనిస్టు నాయకుడు బీఆర్ భగవాన్‌దాస్ 93వ జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల జంక్షన్‌లోని భగవాన్‌దాస్ విగ్రహానికి వినయ్‌భాస్కర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ మాట్లాడుతూ పేదల హక్కుల సాధనకు అవిశ్రాంతంగా పోరాడిన యోధుడు భగవాన్‌దాస్ అనపి కొనియాడారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ నగర ప్రజలకు తాగునీరు అందించేందుకు అప్పటి ముఖ్యమంత్రి చెన్నారెడ్డి పర్యటన నేపథ్యంలో బంద్‌కు పిలుపునిచ్చి సమస్య పరిష్కారానికి భగవాన్‌దాస్ కృషి చేయాలని గుర్తుచేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ వీరగంటి రవీందర్, కానుగంటి శేఖర్, భగవాన్‌దాస్ కుమారులు డాక్టర్ రాజ్‌సిద్ధార్థ్, అంబేద్కర్, లెనిన్, సీపీఐ నాయకులు శ్రీనివాసరావు, ఎన్.జ్యోతి, కె.భిక్షపతి, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలి


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేఏసీ బాధ్యులు

కేయూ క్యాంపస్: తెలంగాణలోని అన్ని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ యూనివర్సిటీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 9న నిర్వహించనున్న చలో ఉస్మానియా మహా సదస్సును విజయవంతం చేయాలని సంఘం బాధ్యులు కోరారు. ఈమేరకు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద వాల్ పోస్టర్లను కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ చైర్మన్ డాక్టర్ కరుణాకర్ రావు, బాధ్యులు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కరుణాకర్‌రావు మాట్లాడుతూ తెలంగాణలోని 12 యూనివర్సిటీల్లో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా ఉన్నవారిని రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చిన హామీనీ సీఎం కేసీఆర్ నిలబెట్టుకోవాలని సూచించారు. సమావేశంలో జేఏసీ కన్వీనర్ డాక్టర్ సాధు రాజేష్, బాధ్యులు డాక్టర్ నిరంజన్, డాక్టర్ మామిడి లింగయ్య, డాక్టర్ వెంకటగోపినాథ్, డాక్టర్ చిర్ర రాజు డాక్టర్ మాదాసి కనకయ్య పాల్గొన్నారు.

అమృతలో 'ఇంటింటి రామాయణం' సినీ బృందం సందడి


మాట్లాడుతున్న హీరోయిన్ నవ్యస్వామి

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని అమృత థియేటర్‌లో ఇంటింటి రామాయణం సినిమా బృందం గురువారం సాయంత్రం సందడి చేసింది. ఈనెల 9న విడుదల కానున్న సినిమా ప్రీమియర్ షోను ప్రేక్షకుల కోసం గురువారం ఉచితంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రేక్షకులతో కలిసి సినిమాలోని నటీనటులు తిలకించారు. సినిమా అనంతరం వారు మాట్లాడుతూ యావత్ తెలంగాణలో ప్రతిఇంటిలో జరిగే సంఘటనల ఆధారంగానే ఈ సినిమా తీశామని, కుటుంబ సమేతంగా ప్రేక్షకులు ఈ సినిమా చూసి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో హీరోయిన్ నవ్యస్వామి, అంజిమామ, థియేటర్ యజమాని వెంకట్ పాల్గొను, మేనేజర్ మోహన్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు పులి రజినీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మైనారిటీలకు సాయం అందించాలి

ఆత్మకూరు: మైనారిటీ చేతివృత్తిదారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని టీకేఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ వలీ గురువారం ప్రకటనలో కోరారు. బీసీ కుల వృత్తిదారులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ప్రభుత్వం అదే మాదిరిగా మైనారిటీలకు కూడా లక్ష రూపాయలు సాయం అందించాలని డిమాండ్ చేశారు. మైనారిటీల్లో అనేక మంది నిరుద్యోగులు ఉన్నారని, ప్రత్యేక రాష్ట్రఏర్పడినప్పటి నుంచి రాష్ట్రప్రభుత్వం ఏ ఒక్క రుణం అందించలేదని తెలిపారు. వెంటనే మైనార్టీలకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం



నడికూడ: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో చిన్నారులకు పరకాల ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం అక్షరాభ్యాసం చేయించారు. ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, సర్పంచ్ ఊర రవీందర్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్‌లు దుప్పటి సంపూర్ణ, అనిత, కళావతి, వినోద, ఆయాలు నర్సమ్మ, సుజాత, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



దామెర: దామెర ఎంపీడీఓగా రవీందర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. 6 నెలల నుంచి సెలవులో ఉన్న అతన్ని ఇటీవల సంగెం ఎంపీడీఓగా బదిలీ చేశారు. ప్రస్తుతం రవీందర్‌ను డిప్యూటేషన్‌పై దామెరకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో రవీందర్ బాధ్యతలు స్వీకరించారు. ఎంపీపీ కాగితాల శంకర్, జెడ్పీటీసీ కల్పన, ఎంపీఓ నాగరాజు, ఏపీఓ శారద, ఏపీఎం ఝాన్సి, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

టీడీపీ హయాంలోనే సుపరిపాలన



నడికూడ: రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందిందని తెలుగుదేశంపార్టీ తెలంగాణరాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నోజు శ్రీనివాస్‌చారి అన్నారు. మండలంలోని పులిగిల్ల గ్రామంలో గురువారం సమ్మక్క-సారలమ్మ వనదేవతలను దర్శించుకున్న అనంతరం తెలుగు దేశం పార్టీని ఆదరించాలని ఇంటింటికీ కరపత్రాలను అందించారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధిని మరిచిపోయారని విమర్శించారు. తెలుగు దేశం పార్టీని బలోపేతం చేసే విధంగా కార్యక్రమాలు రూపొందిస్తున్నామని అన్నారు. పార్టీ రాష్ట్ర రైతు ప్రచార కార్యదర్శి, నాయకులు లక్కం ప్రకాశ్, గంగబోయిన రవీందర్, రామన్న, దిలీప్, శివ, చంద్రమౌళి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉండాలి

న్యూశాయంపేట: కుల, మతాలకు అతీతంగా ప్రతీఒక్కరు సోదరాభావంతో మెలగాలని ప్రముఖ కవి రవికుమార్ సూచించారు. బజ్మే గుల్షన్ ఆదాబ్ వరంగల్ ఆధ్వర్యంలో వరంగల్‌లోని ఓ ఫంక్షన్‌లో హాల్‌లో హజ్ యాత్రికులకు గురువారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా భారతదేశంలో ముస్లింలు, హిందువులు, క్రిస్టియన్లు, తదితరులు పూలబొకేలో పూలలాగా కలిసి మెలిసి ఉంటారని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రముఖ కవుల కవితలు సభికులను ఆకట్టుకున్నాయి. వరంగల్ జిల్లా నుంచి తరలివెళ్లే హజ్ యాత్రికులను సత్కరించారు. ప్రముఖ ఉర్దూ కవి వహీద్ గుల్షన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అబ్దుల్ ఖాదర్, సిరాజుద్దీన్, సయ్యద్ ఫైజుల్లా, సయ్యద్ మిస్బా, అబ్దుల్ ఖార్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో చేర్పించాలి

న్యూశాయంపేట: ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న మైనారిటీ గురుకులాల్లో తమ పిల్లలకు చేర్పించాలని టిమ్రిస్ కౌన్సిల్ సర్వర్ మొహియొద్దీన్ కోరారు. వరంగల్ నగరంలోని మండిబజార్, ఎల్‌బీనగర్, తదితర ప్రాంత్రాల్లో హనుమకొండ హంటర్ రోడ్డులోని హనుమకొండ(జీ-1) ఉపాధ్యాయులు, అధ్యాపకులతో కలిసి గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గురుకులాలల్లో అందజేస్తున్న సౌకర్యాల వివరాలు గల కరపత్రాలను అందజేశారు.